పరిసరాల పరిశుభ్రతతో డెంగీ దూరం



ఈపురుపాలెంలో డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేస్తున్న వైద్యులు, సిబ్బంది



చినగంజాంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది



గుంటుపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

- జాతీయ డెంగీ నివారణ దినోత్సవం
- ర్యాలీలు నిర్వహించిన వైద్య, ఆరోగ్య సిబ్బంది

కారంచేడు/చినగంజాం/మార్టూరు/యద్దనపూడి: ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకున్నట్లయితే దోమల నుంచి వచ్చే డెంగీని నివారించవచ్చని కారంచేడు, స్వర్ణ గ్రామాల పీహెచ్‌సీ వైద్యాధికారులు వైద్యులు జెస్సీరాణి, హస్మప్రియలు తెలిపారు. మంగళవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ర్యాలీలను ఉద్దేశించి వారు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఇంటి ముందు మురుగునీటితో పాటు, చెత్త, చెదారాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి ముందు మురుగునీరు ప్రవహించేలా చూసుకోవాలన్నారు. కుళాయిల లీకేజీలు లేకుండా చూడాలన్నారు. ఎయిర్ కూలర్లలో నీరును కూడా వారానికి ఒకసారి మార్చుకోవాలన్నారు. పూలకుండీలు, వాడని టైర్లు లేకుండా చూడాలన్నారు. నీటి నిల్వలుంటే కిరోసిన్, వాడని ఇంజన్ ఆయిల్‌ను వేయడం వలన దోమలను నియంత్రించవచ్చన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ సువర్ణజ్యోతి, హెచ్‌వీలు వసంతవల్లి, వీరమ్మ, శ్రీనివాసరావు, హెచ్ఈ మీనాకుమారి, ఎల్‌టీలు సుబ్బారావు, శంకర్, స్టాఫ్ నర్సులు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

డెంగీ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చినగంజాం, సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు ఎస్ విజయ భాస్కర్, కే కీర్తి సరోజ అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని చినగంజాం, సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్లకార్డులు చేత ధరించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైద్యులు సాయి శ్రీ చరణ్, బీ నాగేంద్రం, పీహెచ్ఎన్ బేబీ, ఎల్‌టీ శ్యాం, ఫార్మసిస్ట్ సుశీల, హెచ్‌వీ వరదానం, ఎల్‌టీ సుధ, ఫార్మసిస్ట్ ప్రసాద్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని దోమల బారి నుంచి కాపాడుకోవాలని దగ్గుబాడు వైద్యాధికారి డాక్టర్ అనిత అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా పర్చూరులో వైద్యులు, ఆశ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ సుధాకర్, హెచ్ఎస్ శ్రీనివాసరావు, సీహెచ్ వరలక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణతో రోగాలు దూరం..

అద్దంకి/అద్దంకి రూరల్/మేదరమెట్ల/బల్లికురవ/జే.పంగులూరు: దోమల వల్ల చికున్ గున్యా, డెంగీ, మలేరియా, మెదడు వాపు, బోదకాలు వంటి అనేక రకాల వ్యాధులు వస్తాయని, దోమలు నిరారించడం వల్ల ఈ రోగాలకు దూరంగా ఉండవచ్చని పంగులూరు పీహెచ్‌సీ వైద్యుడు రావి మల్లికార్జునరావు అన్నారు. జాతీయ డెంగీ నివారణ డే సందర్భంగా పంగులూరులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారానికి ఒకసారి డ్రైడే పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యులు కృష్ణకుమార్, సీహెచ్ ఓ భారతీ, హెల్త్ ఎడ్యుకేటర్ అనురాధ, సూపర్వైజర్లు వెంకాయమ్మ, మదర్సా, హరిబాబు, చందన తదితరులు పాల్గొన్నారు.

డెంగీ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మోదేపల్లి వైద్యాధికారి జయచంద్ర అన్నారు. డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక బస్టాండ్ నుంచి కాకానిపాలెం ఆరోగ్య కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు గొట్టిపాటి జయసింహ, అనిల్ కుమార్, ఆరోగ్య విస్తరణాధికారి నీలం రామకోటేశ్వరరావు, ఆరోగ్య పర్యవేక్షకుడు, ఆరోగ్య కార్యకర్తలు వై జయశ్రీ, పీ నాగమోహన్, ఆరోగ్య, ఆశలు పాల్గొన్నారు.

డెంగీ సంబంధించిన లార్వాలు అభివృద్ధి చెందకుండా గ్రామాల వారీగా ప్రజలు తగు జాగ్రత్తలు వహించాలని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రమీజ్ అహమ్మద్ కోరారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని గుంటుపల్లి పీహెచ్‌సీ 22 సబ్ సెంటర్లలో ప్రజలకు అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ర్యాలీలో మలేరియా సబ్ యూనిట్ అధికారి శేషగిరిరావు, ల్యాబ్ టెక్నీషియన్ వెంకటేశ్వర్లు, సూపర్ వైజర్ శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

దోమలు కుట్టకుండా జాగ్రత్తలు అవసరం..

చీరాల టౌన్: అన్ని రోగాలకు మూలకారణమైన దోమలు కుట్టకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యురాలు శ్రీదేవి సూచించారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈపురుపాలెం పీహెచ్‌సీ వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు గ్రామంలో అవగాహన ర్యాలీ చేసి మార్కెట్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దోమల వలన వచ్చే వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, దోమలు వ్యాప్తి చెందకుండా ఇళ్ల చుట్టు మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు దోమ తెరలు వాడాలన్నారు. డెంగీ వ్యాధి లక్షణాలు కలిగిన వారు విధిగా వైద్య సేవలు సత్వరమే పొందాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో మోక్షవాణి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది, సచివాలయాల ఉద్యోగులు ఉన్నారు.

ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

- శాప్‌నెట్ ఛైర్మన్ కృష్ణచైతన్య

మేదరమెట్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని శాప్‌నెట్ ఛైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. కొరిశపాడు మండలంలోని దైవాలరావూరు గ్రామంలో రెండో రోజు మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చైతన్య నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ లబ్ధిదారులకు అందుతున్న సంక్షేమ ఫలాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ కుళాయి ఏర్పాటు కోసం భూమి పూజలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న శాప్‌నెట్ ఛైర్మన్ కృష్ణచైతన్య

విధులకు ఆటంకం కలిగించారని కార్యదర్శి ఫిర్యాదు

మార్టూరు: మద్యం మత్తులో తన విధులకు ఆటంకం కలిగించారంటూ వలపర్ల పంచాయతీ కార్యదర్శి ఎం శిరీష సోమవారం రాత్రి మార్టూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యదర్శి శిరీష వివరాల మేరకు.. స్థానిక ఎస్సీ కాలనీలో డ్రైనేజీ కాలువ నిర్మాణం కోసం తవ్విన మట్టిని ఎందుకు తొలగించలేదంటూ సుమారు 15 మంది యువకులు సోమవారం పంచాయతీ కార్యాలయం వద్ద కార్యదర్శి శిరీషను అడిగారు. అందుకు శిరీష డ్రైనేజీ పనులు చేస్తున్న గ్రామ సర్పంచ్ తాళ్లూరి బ్రహ్మయ్యను ఆఫీసుకు పిలిపించి విషయం తెలిపారు. కాలువ నిర్మాణ పనులు తాను చేస్తున్నానని కార్యదర్శికి దీనితో సంబంధం లేదని రెండు రోజుల్లో తొలగిస్తానని వచ్చిన యువకులతో బ్రహ్మయ్య తెలిపాడు. అయినా వినకుండా సర్పంచ్‌తో వాదన పెట్టుకున్న యువకులు కార్యదర్శే సమాధానం చెప్పాలంటూ అసభ్య పదజాలంతో దూషించారని స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు శిరీష తెలిపారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



మత్స్యకార భరోసా సాయం పంపిణీలో పాల్గొన్న అధికారులు, మత్స్యకారులు

చీరాల టౌన్: గంగమ్మ తల్లిని నమ్ముకుని జీవనం సాగించే మత్స్యకారుల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిచ్చిందని మత్స్యకార నాయకుడు, మాజీ వాడరేవు సర్పంచ్ ఎరిపిల్లి రమణ అన్నారు. మంగళవారం మండలంలోని వాడరేవులో ఫిష్‌ల్యాండ్ సెంటర్‌లో వైఎస్సార్ మత్స్యకార భరోసా పంపిణీ కార్యక్రమాన్ని మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి మత్స్యశాఖ ఎఫ్‌డీవో రాజ్‌కుమార్, మత్స్యకార నాయకులు ఎరిపిల్లి రమణ, మచ్చా సువార్త, వైఎస్సార్ కేపీ ఏపీఎంలు సుబ్బారావు, అధిక సంఖ్యలో మత్స్యకారులు పాల్గొన్నారు. నిజాంపట్నంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మత్స్యకారులకు వేట నిషేధంలో అందిస్తున్న భరోసా సాయం పంపిణీకి అనుబంధంగా వాడరేవులో కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మత్స్యకార నాయకులు మాట్లాడుతూ ప్రతి ఏటా వేట నిషేధ సమయంలో గత ప్రభుత్వాలు మత్స్యకారులను విస్మరించారన్నారు. అధికారం చేపట్టినప్పటి నుంచి సీఎం జగన్ మత్స్యకారులకు రూ.10 వేలుకు పెంచి వరుసగా ఐదుసార్లు ఒక్కో మత్స్యకార కుటుంబానికి రూ.50 వేలు అందించి చరిత్రలో నిలిచారన్నారు. నియోజకవర్గంలోని చీరాల, వేటపాలెం మండలాల్లో ఉన్న మత్స్యకారులకు 3497 మందికి మత్స్యకార భరోసా సాయం అందిందన్నారు. మత్స్యకారులకు అండగా నిలిచిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామ కంఠం సమస్య పరిష్కరించాలి

మార్టూరు: మార్టూరు బొడ్డు రాయి సెంటర్ వద్ద ఉన్న గ్రామ కంఠం భూముల సమస్యను పరిష్కరించి ఆదుకోవాలని గ్రామస్తులు మంగళవారం అధికారులను కోరారు. మంగళవారం మార్టూరు గ్రామ ప్రజలు డీటీ మెహతాజ్‌కు వినతి పత్రం అందజేశారు. సర్వే నంబర్ 358/2 గ్రామ కంఠం బొడ్డురాయి సెంటర్ నందు చెన్నకేశవస్వామి దేవస్థానానికి చెందిన 9 సెంట్లు భూమి ఉందని, ఆభూమి దేవదాయశాఖ భూమిగా నమోదు అయిందని తెలిపారు. దాని వల్ల ఇల్లు, స్థలాలు ఉన్న ప్రజలు విక్రయించుకునే అవకాశం లేక, రిజిస్ట్రేషన్‌లు కాక, బ్యాంకు రుణాలు రాక ఇబ్బందులు పడుతున్నారని వారు వివరించారు. దేవస్థాన స్థలాన్ని సబ్ డివిజన్ చేసి మరో నంబరు కేటాయించి న్యాయం చేయాలని వారు కోరారు. ఈ విషయమై విచారణ నిర్వహించి సమస్యను పరిష్కరిస్తామని డీటీ హామీ ఇచ్చారు.



డీటీకి వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

వైభవంగా రాధాకృష్ణ స్వామివారికి మల్లెలార్చన



మల్లెలార్చనలో స్వామివారు

చీరాల అర్బన్: పట్టణంలోని పాపరాజుతోటలో వేంచేసియున్న రాధాకృష్ణ మందిరంలో సోమవారం రాత్రి రాధాకృష్ణ స్వామివారికి లక్ష మల్లెలార్చన నిర్వహించారు. రాధాకృష్ణ స్వామి వారి 32వ వార్షికోత్సవం సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని తిలకించారు. కార్యక్రమంలో రాధాకృష్ణ మందిర కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు స్వాగతం పలికిన నాయకులు







సాక్షి నెట్‌వర్క్: బాపట్ల జిల్లా నిజాంపట్నంలో ఐదో విడత 'వైఎస్సార్-మత్స్యకార భరోసా' కార్యక్రమానికి విచ్చేసిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి నాయకులు సాదర స్వాగతం పలికారు. వారిలో చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్, అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి, శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య, మాజీ ఎమ్మెల్యే గరటయ్య ఉన్నారు.

మాజీ వైస్ ఎంపీపీ ఇంట్లో చోరీ

కారంచేడు: మండల కేంద్రం కారంచేడులో చోరీ జరిగింది. ఎస్సై శ్రీనివాసరావు మంగళవారం తెలిపిన వివరాల మేరకు.. కారంచేడు మాజీ వైస్ ఎంపీపీ జాగర్లమూడి అనీల్‌బాబు ఇంట్లో ఆదివారం రాత్రి ఈ చోరీ జరగగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇంటి యజమానులు అమెరికా వెళ్లారు. దీంతో ఇంటికి కాపలాగా ఆదే గ్రామానికి చెందిన మిరియాల వెంకయ్యకు అప్పగించి వెళ్లారు. అయితే వెంకయ్య ఆదివారం వ్యక్తిగత పనుల నిమిత్తం కాపలాకు రాలేదు. ఇది గమనించిన దొంగలు ఇంటి కిటికీ ఇనుప ఊచలు తొలగించుకొని లోపలికి వెళ్లారు. దేవుడి గుడిలోని వెండి వస్తువులను మాత్రమే దొంగిలించారు. వాటి విలువ సుమారు రూ.20 వేలు ఉంటుందని, యజమాని సోదరుడు జాగర్లమూడి లక్ష్మయ్య చౌదరి ఇచ్చిన ఫిర్యాదుతో మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పొదుపు గ్రూపులకు రుణాల పంపిణీకి సిద్ధం

బల్లికురవ: మండలంలోని 21 గ్రామ పంచాయతీలు, 12 శివారుగ్రామాల్లోని 1358 పొదుపు గ్రూపులకు రూ. 45 కోట్ల మేర రుణాలు పంపిణీకి సిద్ధం చేసినట్లు వైఎస్సార్ కేపీ ఏపీఎం బీ. సురేంద్రబాబు మంగళవారం తెలిపారు. 2023–24 సంవత్సరానికి మండలంలోని ఐదు బ్యాంకుల ద్వారా రూ. 40 కోట్లు బ్యాంకు లింకేజీ రుణాలు రూ. 5 కోట్లు స్త్రీనిధి అందజేసేందుకు డీఆర్‌డీఏ ఆమోదం అభించినట్లు చెప్పారు. బడుగు వికాసంలో ఎస్టీ, ఎస్సీకు 45 శాతం సబ్సిడీపై కారు కొనుగోలుకు ఒక్కో యూనిట్‌కు 30 చొప్పున మూడు యూనిట్లు మంజూరు చేసినట్లు ఏపీఎం వివరించారు.

షార్ట్ సర్క్యూట్‌తో మొక్కజొన్న దగ్ధం



కాలిపోయిన మొక్కజొన్న చేనును పరిశీలిస్తున్న ఏవో

జే.పంగులూరు: మండల పరిధిలోని జనకవరం గ్రామంలో మంగళవారం షార్ట్ సర్క్యూట్‌తో మొక్కజొన్న చేను దగ్ధం అయింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. తల్లపనేని ఆదిశేషయ్య, బొరుగడ్డ అక్కయ్యకు సంబంధించిన మొక్కజొన్న చేనుపై విద్యుత్ తీగల లైన్ ఉంది. చేనుకు పైన ఉన్న జాయింట్ వద్ద నిప్పులు ఏర్పడి మొక్కజొన్న చేనుకు నిప్పంటుకుంది. ఈ ప్రమాదంలో తల్లపనేని ఆదిశేషయ్యకు చెందిన ఒక ఎకరా మొక్కజొన్న, అంకయ్యకు చెందిన 0.40 సెంట్ల పొలం దగ్ధం అయ్యింది. మొక్కజొన్న చేనును పరిశీలించిన ఏవో సుబ్బారెడ్డి రూ. 1 లక్ష మేర నష్టం వాటిల్లిందని తెలిపారు.

కళాకారుడి కుటుంబానికి ఆర్థిక సాయం

అద్దంకి రూరల్: మండలంలోని వేణుగోపాలపురం గ్రామానికి చెందిన పేద కళాకారుడు కంచర్ల వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. గాత్ర, వాద్య కళాకారుల సంక్షేమ సంఘం మృతి చెందిన కళాకారుడు వెంకటేశ్వర్లు కుటుంబానికి మంగళవారం రూ. 10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో జీ శేషగిరిరావు, పీ. శేషగిరిరావు, షేక్ పెద మస్తాన్ పాల్గొన్నారు.

పాదచారులకు మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న యువజన సంఘ సభ్యులు

చీరాల అర్బన్: అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం బస్టాండ్ వద్ద మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గత కొద్ది రోజులుగా వడగాల్పులతో కూడిన ఎంత తీవ్రంగా ఉండడంతో ప్రజలకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో వాసిమళ్ల రత్నకుమార్, బి.వెంకట్రావు, దేవరంపాటి ఆనంద్, కోలా శివ, బొల్లాపల్లి అనిల్, జక్కుల రమేష్, జంగా ప్రేమ్‌కుమార్, గొర్రెముచ్చు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

చీరాల టౌన్: పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పాడి పరిశ్రమతో ఆర్థిక వృద్ధి సాధించాలని పశువైద్యురాలు పావని సూచించారు. మంగళవారం మండలంలోని బోయినవారిపాలెం గ్రామంలోని రైతు భరోసా కేంద్రం వద్ద ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈపశువైద్య శిబిరంలో 53 గేదెలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు, మినరల్ మిక్చర్ దాణాను పంపిణీ చేశారు.

లారీ బోల్తా, డ్రైవర్‌కు గాయాలు

మార్టూరు: లారీ అదుపు తప్పి బోల్తా పడటంతో డ్రైవర్ తీవ్రంగా గాయపడిన ఘటన మంగళవారం సాయంత్రం మార్టూరు సమీపంలో జరిగింది. 108 సిబ్బంది నాగేశ్వరమ్మ వివరాల మేరకు.. ఉత్తరప్రదేశ్‌కి చెందిన ఓ భారీ వాహనం ఇనుప దిమ్మెలు రవాణా చేస్తూ గుంటూరు వైపు నుంచి ఒంగోలు వైపు వెళ్తోంది. జాతీయ రహదారి పక్కన రాజుపాలెం జంక్షన్ వద్ద గల రెస్ట్ ఏరియాలోకి డ్రైవర్ ఖాసిం వాహనాన్ని మళ్లిస్తుండగా అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్రగాయం కావడంతో 108 సిబ్బంది ఖాసింను గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నిప్పులు కక్కుతున్న సూరీడు



చినగంజాం: మజ్జిగ చలివేంద్రం వద్ద కిటకిటలాడుతున్న జనం



నిర్మానుష్యంగా పంగులూరులోని ప్రధాన రహదారి



కారంచేడు ప్రాంతంలో నమోదైన ఉష్ణోగ్రతలు



కారంచేడు: 11 గంటలకే నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి

రోజురోజుకీ సూర్యుడు పగబట్టినట్లుగా తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఉదయం ఏడు గంటల నుంచే ఎండ వేడిమి మొదలై మధ్యాహ్న సమయంలో వడగాల్పులతో భయంకరంగా మారుతున్నాడు. రాత్రి అయినా సరే వేడి తగ్గడం లేదు. ఈనేపథ్యంలో ప్రజలు ఇంట్లో నుంచి బయటకు రావాలంటే భయపడతున్నారు. ఈపరిస్థితుల్లో బయటకు రాకపోవడమే మంచిదంటున్నారు వైద్యులు. మరో వారం రోజులు ఇలాగే ఎండలు ఉంటాయని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్